బడికెళ్లాలంటే నరకమే



బురదమయంగా రోడ్డు



బురదలో ఆటో దిగబడడంతో నెడుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయిని

అధ్వానంగా చల్లగిరిగల-గజ్జలవారిపల్లి రోడ్డు

- చినుకుపడితే ఆటోలు, బైక్‌లు కూడా తిరగని పరిస్థితి
- మూడు కి.మీ.నడిచి వెళ్లేందుకు విద్యార్థుల అవస్థ

కొండాపురం : మండలంలోని గరిమెనపెంట పంచాయతీ పరిధిలోని చల్లగిరిగల గ్రామానికి చెందిన విద్యార్థులు వర్షం పడితే బడికెళ్లేందుకు నరకాన్ని చవిచూస్తున్నారు. చల్లగిరిగలకు చెందిన 24 మంది విద్యార్థులు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న గజ్జలవారిపల్లి గ్రామ పాఠశాలలో చదువుతున్నారు. వీరంతా నిత్యం ఆటోలో పాఠశాలకు వెళ్తుంటారు. చల్లగిరిగల నుంచి గజ్జలవారిపల్లి వరకు సుమారు మూడు కిలో మీటర్ల దూరం మట్టిరోడ్డు ఉంది. చిన్నపాటి వర్షం కురిసినా మట్టి రోడ్డు కాస్తా బురదమయంగా మారుతోంది. దీంతో కనీసం ఆటోలు, బైక్‌లు కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొంటోంది. ఫలితంగా విద్యార్థులు మూడు కిలోమీటర్ల దూరం నడిచి వెళ్లాల్సి వస్తోంది. ఈ కారణంగా కొందరు విద్యార్థులు బడి సైతం మానేస్తున్నారు. ఇప్పటికైనా పంచాయతీ పాలకులు, అధికారులు స్పందించి రోడ్డు సౌకర్యం కల్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఆటో దిగబడిపోతుంది



చల్లగిరిగల నుంచి గజ్జలవారిపల్లి వరకు సుమారు మూడు కిలో మీటర్ల దూరం ఉంది. చిన్నపాటి వర్షం కురిసిన మట్టిరోడ్డు చిత్తడి చిత్తడిగా మారుతోంది. ఆటో బురదలో దిగబడిపోతుండడంతో విద్యార్థులను తీసుకెళ్లడం కష్టమవుతోంది. ఒక్కోసారి విద్యార్థులే ఆటోను నెట్టాల్సిన పరిస్థితి నెలకొంటోంది. అధికారులు స్పందించి రోడ్డు సమస్యను పరిష్కరించాలి.

-రామకృష్ణ, ఆటోడ్రైవర్



బురదలో నడిచివెళ్తున్న విద్యార్థులు

నిలువు నీడ కరువు



ఎండలో బస్సు కోసం వేచిచూస్తున్న ప్రయాణికులు

అనుమసముద్రంపేటలో ప్రయాణికులకు నిలువు నీడ కరువైంది. ఏఎస్‌పేటలోని దర్గాకు దేశ నలుమూలల నుంచి పర్యాటకులు తరలివస్తుంటారు. ముఖ్యంగా రొట్టెల పండగ, గంధ మహోత్సవాల సమయంలో భక్తుల రద్దీ అధికంగా ఉంటుంది. అయితే బస్టాండ్ సెంటర్‌లో బస్‌షెల్టర్ లేకపోవడంతో ప్రయాణికులు పడరాని పాట్లు పడుతున్నారు. ఎండకు, వానకు దుకాణాల నీడన తలదాచుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. గతంలో వైఎస్సార్ విగ్రహం వద్ద బస్‌షెల్టర్ ఉండగా ఆక్రమణకు గురైంది. అప్పట్నుంచి ప్రయాణికులు రోడ్డుపైనే పడిగాపులు కాస్తున్నారు. మరోవైపు మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యాలు లేకపోవడంతో పర్యాటకులు అవస్థ పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, రాజకీయ నాయకులు స్పందించి ఏఎస్‌పేట బస్టాండ్ సెంటర్‌లో బస్‌షెల్టర్ నిర్మించి మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యాన్ని కల్పించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

- అనుమసముద్రంపేట

విలేజ్ హెల్త్‌క్లినిక్ భవనానికి మోక్షమెన్నడో?



అసంపూర్తిగా విలేజ్ హెల్త్‌క్లినిక్ భవనం



భవన నిర్మాణంలో ఖాళీ మద్యం సీసాలు

కలిగిరి: మండలంలోని కృష్ణారెడ్డిపాళెంలో విలేజ్ హెల్త్ క్లినిక్ భవన నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయి మందుబాబులకు అడ్డాగా మారింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలనే సదుద్దేశంలో గ్రామసచివాలయాలకు అనుబంధంగా విలేజ్ హెల్త్‌క్లినిక్‌లను ఏర్పాటు చేసింది. అందులో భాగంగా కృష్ణారెడ్డిపాళెంలో విలేజ్ హెల్త్‌క్లినిక్ భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. శ్లాబ్, గోడల నిర్మాణం వరకు పనులు పూర్తయ్యాయి. అయితే కూటమి ప్రభుత్వం గత ప్రభుత్వం చేపట్టిన భవన నిర్మాణాలను నిలిపివేయడంతో విలేజ్ హెల్త్‌క్లినిక్ భవనం అసంపూర్తిగా దర్శనమిస్తోంది. కొద్ది మొత్తం నిధులు ఖర్చు చేస్తే భవనం అందుబాటులోకి వచ్చే అవకాశం ఉన్నా పట్టించుకోకపోవడంతో మందుబాబులు, జూదరులకు అడ్డాగా మారింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి భవన నిర్మాణాన్ని పూర్తి చేసి ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలకు వినియోగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

క్లుప్తంగా

ఉచిత కంటి వైద్యశిబిరం



కావలి(అల్లూరు): కావలిలోని రెడ్‌క్రాస్ భవనంలో చాగణం లలితమ్మ, భాస్కర్‌రావు మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. తిరుపతి శ్రీవెంకటేశ్వర అరవింద్ కంటి నేత్రాలయం వైద్యులు కంటి పరీక్షలను నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ ట్రస్టీ చాణగం గౌరీశంకర్ మాట్లాడుతూ ట్రస్ట్ ద్వారా చేపడుతున్న సేవా కార్యక్రమాలను వివరించారు. జనవరి నుంచి ప్రతినెలా ఉచిత కంటి వైద్య శిబిరాలను కావలితో పాటు జలదంకిలో కూడా నిర్వహిస్తామని తెలిపారు. ట్రస్టు ద్వారా నిరుద్యోగులకు ఉపాధి కల్పనకు స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులను ప్రారంభిస్తామన్నారు.

ఏపీఐఐసీ డైరెక్టర్‌గా కంచర్ల మాధవి



ఆత్మకూరురూరల్: మండలంలోని నారంపేట సర్పంచ్ కంచర్ల మాధవిని ఏపీఐఐసీ డైరెక్టర్‌గా నియమిస్తూ ప్రభుత్వం నుంచి ఆదివారం ఆదేశాలు అందాయి. రెండు పర్యాయాలు సర్పంచ్‌గా కొనసాగుతున్న మాధవి నియామకంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

గాడిచర్లకు నివాళి



కావలి(అల్లూరు): కావలిలోని గ్రంథాలయంలో స్వాతంత్ర్య సమరయోధుడు, గ్రంథాలయ ఉద్యమకారుడు గాడిచర్ల హరిసర్వోత్తమరావు జయంతిని ఆదివారం నిర్వహించారు. గాడిచర్ల చిత్రపటానికి గ్రంథాలయాధికారి బొమ్మల కోటేశ్వరి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యుడు మాలకొండారెడ్డి మాట్లాడుతూ గాడిచర్ల జీవిత విశేషాలను విద్యార్థులకు వివరించారు.

24న దళిత రణభేరి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న బీఎస్పీ నాయకులు

ఆత్మకూరు: ఈ నెల 24న విజయవాడలో బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో 'దళిత రణభేరి' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆ పార్టీ ఆత్మకూరు నియోజకవర్గ నాయకులు తెలిపారు. పట్టణంలోని బీఎస్పీ కార్యాలయంలో దళిత రణభేరి పోస్టర్లను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా సలహాదారు టీ కృష్ణ, ఆత్మకూరు నియోజకవర్గ ఇన్‌చార్జి శేషాద్రి మాట్లాడుతూ బీఎస్పీ రాష్ట్రాధ్యక్షుడు బందెల గౌతమ్ పిలుపు మేరకు చేపడుతున్న దళిత రణభేరి కార్యక్రమంలో పార్టీ శ్రేణులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం అనంతసాగరం మండల కన్వీనర్‌గా మారెళ్ల ప్రసాద్, ఆత్మకూరులోని 13వ వార్డు బాధ్యుడిగా ఉదయగిరి చిన్నయ్యను నియమించారు. పార్టీ నాయకులు జంగం రవీంద్ర, జ్యోతి శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

భూమి నుంచి భారీ శబ్దాలు

- భయాందోళనకు గురైన ప్రజలు



పార్వతమ్మ లేఅవుట్‌లో పరిశీలిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

కావలి(అల్లూరు): కావలిలోని పార్వతమ్మ లేఅవుట్, పార్వతమ్మ గెస్ట్‌హౌస్ పరిసర ప్రాంతాల్లో ఆదివారం మధ్యాహ్నం భూమి నుంచి భారీ శబ్దాలు వినిపించాయి. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 3.30 గంటల వరకు సుమారు 14 సార్లు భారీ శబ్దాలు వినిపించడంతో స్థానికులు భయాందోళనలకు గురయ్యారు. స్థానికుల సమాచారంతో పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని శబ్దాల మూలాలను గుర్తించే ప్రయత్నం చేశారు. చివరికి తాళ్లపాళెం చెరువు వద్ద ఓఎన్‌జీసీ సంస్థ బోర్లు వేస్తున్న క్రమంలో ఈ శబ్దాలు వచ్చాయని నిర్ధారించారు. దీంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు.

యూటీఎఫ్ రణభేరి జయప్రదానికి పిలుపు



రణభేరి పోస్టర్లను ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

వింజమూరు (ఉదయగిరి): ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చలపతిశర్మ అన్నారు. వింజమూరులోని యూటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో యూటీఎఫ్ రణభేరి పోస్టర్లను ఆదివారం ఆవిష్కరించారు. అనంతరం యూటీఎఫ్ కార్యకర్తలతో సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూపర్‌సిక్స్ సూపర్ హిట్ అంటూ సంబరాలు జరుపుతున్న కూటమి ప్రభుత్వం ఆ పథకాలను ప్రజలకు అందించడానికి వారధులైన ఉద్యోగులతో పాటు ఉపాధ్యాయులను విస్మరించిందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై 14 నెలలు గడిచినా పీఆర్సీ, డీఏ, ఐఆర్, తదితర సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ నెల 17న ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి వింజమూరులో చేపట్టనున్న రణభేరి ప్రచార యాత్రలో ఉపాధ్యాయులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. యూటీఎఫ్ నాయకులు చెంచలబాబు, వెంకటేశ్వరరెడ్డి, వీరాంజనేయులు, పరమేశ్వరరావు, మాల్యాద్రి, మీరావలి, నాగేశ్వరరావు, సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

పశువుల నీటి తొట్టె నిర్మాణానికి శంకుస్థాపన

ఆత్మకూరురూరల్: మండలంలోని వెన్నవాడలో బొగ్గేరు వాగు పక్కన ఉపాధి హామీ పథకం కింద పశువుల నీటి తొట్టె నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో వెన్నవాడ సొసైటీ డైరెక్టర్ దిశించర్ల మాధవ్, ఫీల్డ్ అసిస్టెంట్ రేవూరు విజయ నరసింహారెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలి



మర్రిపాడు: భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలను అందించి ఆదుకోవాలని సీఐటీయూ మండల కార్యదర్శి బత్తల రత్నయ్య కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. మర్రిపాడులోని సుందరయ్య భవనంలో భవన నిర్మాణ కార్మికుల మండల మహాసభను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కేంద్ర భవన నిర్మాణ కార్మికులకు పని కల్పించాలని, ఇసుక ఉచితంగా అందజేయాలని, కార్మికులు పనిచేస్తూ ప్రమాదవశాత్తు చనిపోతే రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియాను ఇవ్వాలని కోరారు. ఏపీ రైతు సంఘం నాయకుడు మూలి వెంగయ్య మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులు చెడు వ్యసనాలకు బానిస కాకుండా ఉండాలని కోరారు. అనంతరం నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా బత్తల రత్నయ్య అధ్యక్షుడిగా దేవుండ్ల వెంకటరమణయ్య, కార్యదర్శిగా దండు జాన్సన్, ఉపాధ్యక్షుడిగా డబ్బుకొట్టు వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శిగా కన్నెమరకల ప్రసాద్, కోశాధికారిగా కోలకాని విజయకుమార్‌ను ఎన్నుకున్నారు. సీపీఎం మండల కార్యదర్శి రహమతుల్లా, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి మూల లింగయ్య సీఐటీయు మండల కార్యదర్శి బత్తల రత్నయ్య పాల్గొన్నారు .

వీధుల్లో మురుగు ప్రవాహం



భోగ్యంవారిపల్లిలో వీధిలో ప్రవహిస్తున్న మురుగు

వరికుంటపాడు: మండలంలోని వేంపాడు పంచాయతీ పరిధిలోని భోగ్యంవారిపల్లిలో డ్రైనేజీలు లేక మురుగు వీధుల్లో ప్రవహిస్తోంది. ఈ కారణంగా దోమలు వ్యాప్తి చెందుతూ ప్రజలు విషజ్వరాల బారిన పడుతున్నారు. ప్రస్తుతం వెంగమాంబపురం, టీ కొండారెడ్డిపల్లి గ్రామాల్లో అధిక మంది విషజ్వరాలతో తల్లడిల్లుతున్నారు. వాతావరణంలోని మార్పులు, దోమల వృద్ధితో విషజ్వరాలు ప్రబలుతున్నాయి. పంచాయతీ పాలకులు స్పందించి పారిశుధ్య మెరుగునకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నాయి.

కూలేందుకు సిద్ధంగా...



కొండాపురం-ఆదిమూర్తిపురం మధ్యన పొలాల్లో 11కేవీ విద్యుత్‌లైన్ స్తంభం పూర్తిగా ఒరిగిపోయి కూలే స్థితిలో ఉంది. ఈ లైన్ ద్వారా కొండాపురం సబ్‌స్టేషన్ నుంచి తూర్పు బ్రాహ్మణపల్లి గ్రామం వద్ద ఉన్న ఓవర్ హెడ్‌ట్యాంక్‌కు విద్యుత్ సరఫరా అవుతుంది. విద్యుత్ స్తంభం కూలిపోతే తాగునీటి సమస్య తలెత్తే అవకాశం ఉంది. మరోవైపు తీగలు కిందకు వేలాడుతూ పొలాలు దున్నే, వ్యవసాయ ఉత్పత్తులను తరలించే సమయంలో ట్రాక్టర్లకు తగులుతుండడంతో రైతులు ఎప్పుడు ఏం జరుగుతుందోనని భయాందోళనలు చెందుతున్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి విద్యుత్ స్తంభాన్ని సరి చేయాలని రైతులు కోరుతున్నారు.

- కొండాపురం

వసతిగృహాన్ని పరిశుభ్రంగా ఉంచాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న బీసీ వెల్ఫేర్ సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి

సోమశిల: అనంతసాగరం మండలం రేవూరులోని బీసీ బాలికల వసతి గృహాన్ని జిల్లా బీసీ వెల్ఫేర్ సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతి గృహ పరిసరాలు, వసతి గదులు, మరుగుదొడ్లను పరిశీలించారు. వసతిగృహ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని వార్డెన్ మల్లీశ్వరికి సూచించారు. వర్షాలకు విషజ్వరాలు ప్రబలే అవకాశం ఉన్నందున తరచూ శానిటేషన్ చేపట్టాలన్నారు. వసతిగృహంలోని సమస్యలు, భోజనం నాణ్యతపై ఆరాతీశారు. అనంతరం పదో తరగతి విద్యార్థులతో ముచ్చటించారు. కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. ఆమె వెంట ఆత్మకూరు ఏబీసీడబ్ల్యూఓ కృష్ణయ్య, తదితరులు ఉన్నారు.

సిట్టింగ్‌కు సన్నాహాలు



ఆత్మకూరులోని ఓ మద్యం దుకాణం పక్కన సిట్టింగ్‌రూములో బెంచీల నిర్మాణం

ఆత్మకూరు: ప్రభుత్వం సిట్టింగ్ రూముల ఏర్పాటుకు పచ్చజెండా ఊపడంతో ఆత్మకూరులోని మద్యం దుకాణాల్లో అందుకు సన్నాహాలు ప్రారంభించారు. దుకాణాల పక్కన ప్రత్యేకంగా సిట్టింగ్ రూముల నిర్మాణం చేపడుతున్నారు. అందులో మందుబాబులు మద్యం సేవించేందుకు వీలుగా ప్రత్యేకంగా బెంచీలను ఏర్పాటు చేస్తున్నారు. మద్యపానాన్ని అరికట్టాల్సిన ప్రభుత్వం మద్యం సిండికెట్లతో కుమ్మక్కై సిట్టింగ్‌రూముల ఏర్పాటుకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని



అవగాహన కల్పిస్తున్న జేవీవీ నాయకులు

కావలి(అల్లూరు): దోమల నిర్మూలనకు పరిసరాల పరిశుభ్రతే ఉత్తమ మార్గమని జన విజ్ఞాన వేదిక గౌరవాధ్యక్షుడు బెజవాడ రవికుమార్ తెలిపారు. కావలిలోని టీపీఎస్ సెంటర్ వద్ద జేవీవీ ఆధ్వర్యంలో కీటక జనిత వ్యాధులపై అవగాహన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమలతో మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా, బోధకాలు, మెదడు వాపు, తదితర వ్యాధులు వ్యాప్తి చెందుతాయన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, ఇళ్లలో నీరు నిల్వ లేకుండా చూసుకోవడం ద్వారా దోమల వ్యాప్తిని అరికట్టవచ్చన్నారు. దోమలు కుట్టకుండా దోమతెరలు వాడడం ద్వారా వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చని తెలిపారు. జేవీవీ సభ్యులు సుబ్బరామశర్మ, నారాయణ, వెంకయ్య, ఖాదర్‌బాషా, కల్లయ్య, శారద, మాధవ్, కృష్ణారెడ్డి, మాలకొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రక్షణ కంచె ఏర్పాటు చేయరూ..

ఆత్మకూరు: పట్టణంలోని 23వ వార్డు పరిధిలోని నెల్లూరుపాళెం బీసీకాలనీలో ఆత్మకూరు- వింజమూరు రోడ్డు పక్కనున్న ట్రాన్స్‌ఫార్మర్ రక్షణ కంచె లేక ప్రమాదభరితంగా ఉంది. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద గడ్డి పెరిగి తీగలు అల్లుకుని ఉండడంతో పశువులు మేసేందుకు వెళ్తూ విద్యుత్‌షాక్‌కు గురై ప్రాణాలు కోల్పోతున్నాయి. ఇదే పరిస్థితి నెల్లూరుపాళెంలోని గిరిజనకాలనీలోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద నెలకొని ఉందని స్థానికులు తెలిపారు. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ రక్షణ కంచె ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



నెల్లూరుపాళెం బీసీ కాలనీలో రక్షణ కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్